సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం, 3, మార్చి, 2025



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ॥ (సా॥)	సహార్ మంగళ॥ (ఉ॥)
రాయచోటి :	6.28	5.09
రాజంపేట :	6.26	5.18
పీలేరు :	6.27	5.09
మదనపల్లె :	6.29	5.12



గన్నే నీకు ఇది తగునా..!

టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు తమకు చెందిన భూముల్లోకి రానివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని దళితులు వాపోతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 54 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 3వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వంచనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై

చిన్నమండెం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైరస్ వల్ల వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పశుసంవర్ధక శాఖ ఈ టీకా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి గాలికుంటు నివారణకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.

రికార్డుల తారుమారుపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి టాస్క్‌ఫోర్స్: రెవెన్యూ రికార్డుల తారుమారు అంశంపై జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ స్పందించారు. ఆదివారం 'సాక్షి'లో తహసీల్దార్ కార్యాలయం రికార్డుల తారుమారు శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాలపైన విచారణ చేపట్టి నివేదికను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ సర్వే నంబర్ల రికార్డుల పరిశీలనతోపాటు సీసీ పుటేజీలు, కార్యాలయ సిబ్బందితో ఆరా తీసినట్లు తెలియవచ్చింది.

- కార్యాలయంలో రికార్డుల తారుమారు విషయంలో తాను ఏ తప్పు చేయలేదని రాయచోటి ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహ కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

కొనమెరుపు...

సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కేంద్రంలో సోషల్ మీడియా వేదికగా, ప్రజల మధ్య చర్చ జరగడం విశేషం. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఫిబ్రవరి 25 కాదని, 24న ఈ తతంగం జరిగిందన్న విషయంపై కూడా కార్యాలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

మెగా డీఎస్సీ దగా!

- డీఎస్సీకి వర్గీకరణ లింకు
- అమలుకాని బాబు తొలి సంతకం
- నిరుద్యోగులతో కూటమి సర్కారు బంతాట
- ప్రభుత్వ తీరుపై ఆశావహుల ఆగ్రహం



డీఎస్సీకి కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)



మదనపల్లె సిటీ: ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్న కల నెరవేర్చుకోవడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేస్తోంది. మెగా డీఎస్సీ అంటూ తొలి సంతకం చేస్తూ హడావిడి చేసిన సీఎం చంద్రబాబు తర్వాత మూడు సార్లు వాయిదా వేశారు. దానికి ఎస్సీ వర్గీకరణ లింకు పెట్టారు. ఆ నివేదిక వచ్చిన తర్వాతే డీఎస్సీ అంటూ అభ్యర్థుల ఆశలపై నీళ్ల చల్లారు. దీంతో నెలల తరబడి కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు.

- నవ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలంటే ఉపాధ్యాయులు కావడమే ఉత్తమ మార్గమని భావించిన అభ్యర్థులు ప్రస్తుతం కోచింగ్ సెంటర్లలో మగ్గిపోతున్నారు. డీఎస్సీ వాయిదాలు పడుతూ ఉండటంతో నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ కోచింగ్ వదులుకోలేక, ప్రైవేటు పాఠశాలలో తక్కువ జీతాలకే ఉపాధ్యాయులుగా చేరుతున్నారు.

నెలల తరబడి పుస్తకాలతో కుస్తీ

డీఎస్సీ నియామకాల్లో ఏళ్ల తరబడి జరుగుతున్న జాప్యం నిరుద్యోగులను నిరాశకు గురి చేస్తోంది. 1994కు ముందు టీచర్ల నియామకాలు జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరిగేవి. 1994 నుంచి రాష్ట్ర స్థాయిలో డీఎస్సీ ద్వారా చేపడుతున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2024 ఫిబ్రవరిలో టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని త్వరలో జరిగే పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పరీక్షలు రాసే స్థాయిలో ఉన్న డీఎస్సీని రద్దు చేసి నిరుద్యోగుల నెత్తిన పిడుగు వేసింది. ప్రభుత్వ తీరుతో డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

వాయిదాలతో సాకులు

తొలుతేమో టెట్ మరోసారి నిర్వహించి ఆపై డీఎస్సీ జరుపుతామని చెప్పింది. తర్వాత గతంలో డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి అడ్డంకులు తొలగించి నోటిఫికేషన్ ఇస్తామని వాయిదా వేసింది. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చిన తరువాత నిర్వహిస్తామంటూ లింకు పెట్టింది. అయితే ఈ ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదిక వచ్చేదెప్పుడు, డీఎస్సీ నిర్వహించేదెప్పుడని అభ్యర్థులు అయోమయం పరిస్థితిలో ఉన్నారు.

కూటమి సర్కార్ నిర్వాకం

మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం అని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతే హడావిడిగా సంతకం చేశారు. తర్వాత రోజుకో సాకు చూపుతూ వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నారు. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చిన తరువాతనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దీంతో నెలల తరబడి వాయిదాల పర్వం కొనసాగుతోంది. నిరుద్యోగులు మాత్రం కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగంపై వారి ఆశలు సన్నగిల్లుతున్నాయి.

ఖాళీలు ఇలా..



ఉమ్మడి చిత్తూరు,వైఎస్సార్ జిల్లాల్లో వందల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో ఎస్జీటీలు 104, వైఎస్సార్ జిల్లాలో 100 ఖాళీలు, స్కూల్ అసిస్టెంట్లు చిత్తూరులో 29, వైఎస్సార్ జిల్లాలో 19, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలకు సంబంధించి చిత్తూరు జిల్లాలో 181, వైఎస్సార్ జిల్లాలో 194 ఖాళీలు ఉన్నాయి. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చిత్తూరులో 3, వైఎస్సార్ జిల్లాలో 4 పోస్టులున్నాయి. మున్సిపల్ పాఠశాలల్లో చిత్తూరు జిల్లాలో 49, వైఎస్సార్ జిల్లాలో 39 ఖాళీలు ఉన్నాయి. మొత్తం మీద చిత్తూరు జిల్లాలో 1478, వైఎస్సార్ జిల్లాలో 709 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారని ఆశపడ్డ నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. వారు ఎంతో ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నారు. ఇప్పటికి మూడు సార్లు వాయిదా వేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

వాయిదాలతో మోసం



డీఎస్సీ అదిగో ఇదిగో అంటూ వాయిదాలతో సరిపెడుతున్నారు. అసలు నిర్వహిస్తారో లేదో తెలియడం లేదు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా నేటికి కార్యారూపం దాల్చలేదు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరగా స్పందించాలి.

–గంగారాణి, మదనపల్లె

పేదలకు దానం.. పుణ్య మార్గం

- రంజాన్ మాసంలో దానధర్మాలకు ప్రాధాన్యత
- తొలిరోజే మొదలైన జకాత్



పేదలకు జకాత్ పంపిణీ చేస్తున్న షేక్ మహబూబ్‌బాషా

రాజంపేట టౌన్: రంజాన్ మాసంలో దాన ధర్మాలకు ప్రాధాన్యత ఉంటుంది. ధనికులే కాక పేదలు సైతం పండుగను సంతోషంగా జరుపుకోవాలని జకాత్ పంపిణీ చేస్తారు. ఏడున్నర తులాల బంగారు లేదా 52 తులాల వెండి లేదా అంత విలువైన ధన, ఆస్తులు కలిగి ఉండే ప్రతి ముస్లిం జకాత్ ఇవ్వాలని పవిత్ర దివ్య ఖురాన్ గ్రంథం చెబుతోంది. ప్రతి ముస్లిం తమ సొమ్మును లెక్కకట్టి అందులో నుంచి 2.5 శాతం పేదలకు రంజాన్ మాసంలో విధిగా పంచాలి. అలాగే మధ్యతరగతికి చెందిన వారు కూడా కనీసం 1750 గ్రాముల గోధుములు లేకుంటే అంతకు సమానమైన డబ్బును పేదలకు దానం చేయాలని పవిత్ర దివ్య ఖురాన్ చెబుతోంది. కాగా పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన ఆదివారం రాజంపేట పట్టణం బలిజపల్లెరోడ్డుకు చెందిన షేక్ మహబూబ్‌బాషా రూ.1 లక్ష విలువ చేసే ఆహార వస్తువులను జకాత్ ద్వారా పేదలకు పంపిణీ చేశారు.

70 రెట్ల పుణ్యం: కల్మా, నమాజ్, రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాంకు మూలస్థంభాలు. జకాత్ ఇచ్చిన వారి సొమ్మును అల్లాహ్ రక్షించడమే కాకుండా వృద్ధి చేస్తారని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. రంజాన్ మాసంలో పేదలకు దానం చేసే వారికి సాధారణ రోజుల్లో దానం చేసేదానికన్నా 70 రెట్ల పుణ్యం అధికంగా లభిస్తుందని, ముస్లిం మతపెద్దలు చెబుతున్నారు.

జకాత్‌ను ఇలా లెక్కగడతారు....

- ఒక వ్యక్తి న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బు నుంచి కొంత భాగం జకాత్‌కు ఇవ్వాలి
- 52 తులాల వెండి, ఏడున్నర తులాల బంగారం లేదా అంతకు సమానమైన డబ్బు ఉన్న వారు ప్రతి ఏడాది వాటి విలువను లెక్కకట్టి రెండున్నర శాతం జకాత్‌కు కేటాయిస్తారు.
- స్థిరాస్తిలో వచ్చే ఆదాయంలో ఏమైనా మిగులు ఉంటే దానికి కూడా జకాత్ వర్తిస్తుంది.
- బంగారు ఆభరణాలు తూకం వేయడంలో, స్థిరాస్తులపై ఉన్న నగదు ఆదాయం లెక్కింపులో పారదర్శకత ఉండాలి.
- జకాత్‌కు అర్హులైన వారిని గుర్తించడంలో సైతం ఎలాంటి పక్షపాతం ఉండకూడదు
- దివ్యాంగులు, భర్తలేని మహిళలు, అత్యంత నిరుపేదలు, జకాత్ ఇచ్చే వారిలో వారి బంధువులు ఎవరైనా నిరుపేదలు ఉంటే ముందు వారికి జకాత్ ఇవ్వాలి.
- జకాత్ ఇవ్వడంలో దర్పంగాని, పెద్దరికం గాని చూపించకుండా హుందాగా వ్యవహరించాలని ఇస్లాం సిద్ధాంతాల్లో స్పష్టంగా పొందుపరచి ఉంది.

హార్సిలీహిల్స్ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుక

- 50 ఏళ్ల తర్వాత కలయిక
- వీరిలో మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు



గోల్డెన్ జూబ్లీ జరుపుకున్న పూర్వ విద్యార్థుల గ్రూప్‌ఫొటో

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఒకప్పుడు ఉన్న స్కూలులో చదువుకున్న విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఇదే హార్సిలీహిల్స్‌పై ఆదివారం కలుసుకుని గోల్డెన్ జూబ్లీ వేడుకను ఉత్సాహంగా జరుపుకున్నారు. కొండపై గతంలో హార్సిలీహిల్స్ హైస్కూల్ ఉండేది. 1975లో పదో తరగతి కలిసి చదువుకున్న అప్పటి విద్యార్థులు..ప్రస్తుతం వివిధ రంగాల్లో, రాజకీయాల్లో ఉన్న వీరంతా సమావేశం నిర్వహించుకున్నారు. అప్పటి గురువులను స్మరించుకుని మృతిచెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తాము చట్టసభల్లో పని చేశామని, ఉన్నతాధికారులమన్న భావన లేకుండా ఒక్కటిగా కలిసి కొండపై సందడి చేశారు. కాలినడక ప్రకృతి అందాలను తిలకిస్తూ అప్పట్లో ఇక్కడ ఇలా ఉండేది..ఇప్పుడు ఇలా ఉంది అంటూ స్మృతులను నెమరేసుకున్నారు. సరదాగా క్రికెట్, ఇతరా క్రీడలు ఆడారు. చివర్లో పాత మిత్రులు కలిసి గ్రూప్‌ఫొటో దిగారు. ఈ పూర్వ విద్యార్థుల్లో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ రెడ్డి, విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ ఓంకార్, అనీషారెడ్డి, శ్రీనాథ రెడ్డి, రాటకొండ తిలక్ తదితరులు పాల్గొన్నారు.


13న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: తమిళనాడులోని అరుణాచలానికి పౌర్ణమి సందర్భంగా ఈ నెల 13న స్పెషల్ బస్సు నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బద్వేలులో ఉదయం 9 గంటలకు బయలుదేరే సర్వీసు రాను, పోను కలిపి రూ.1250గా నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. ఈ బస్సు కడపకు ఉదయం 10.30 గంటలకు చేరుతుందన్నారు. కడప నుంచి రూ.1150, రాయచోటి బంగ్లా వద్దకు 11.45 గంటలకు చేరుతుందని, అక్కడి నుంచి రాను, పోను రూ.1050గా చార్జీ ఉంటుందన్నారు. మూడు స్టాపింగ్‌లో ఈ బస్సు ఆగుతుందన్నారు. రిజర్వేషన్ల కోసం (సర్వీసు నంబర్: 9569) ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో అరుణాచలం అని టైప్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఫోన్ ద్వారా (8886090136) కూడా చార్జీని చెల్లించే అవకాశం ఉందన్నారు.

జజ్జనకర.. జాతర



జాతరలో పాల్గొన్న అశేష భక్తజనం



విశేష అలంకరణలో గంగమ్మ దేవత

- ముగిసిన గంగమ్మ ఉత్సవం
- అశ్వవాహనంపై అమ్మవారి ఊరేగింపు
- భక్తజన సంద్రమైన అనంతపురం

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు కమనీయంగా జరిగిన వేడుకలు ఆదివారం ముగిశాయి. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసింది. అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు ఉత్సాహ భరితంగా జరిగింది. వివిధ రంగులతో కూడిన చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జబర్దస్త్ ఆర్కెస్ట్రా కార్యక్రమం అలరించింది. లక్కిరెడ్డిపల్లి జర్నలిస్టులు, మానవతా స్వచ్ఛంద సంస్థ, రాయచోటి మురళీ నవోదయ కోచింగ్ సెంటర్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంతో.. తాగునీటి దాహార్తి నుంచి ఉపశమనం కల్గింది. గంగ జాతర అంటే చెరుకులను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఉత్సవానికి వచ్చిన భక్తులు చెరుకులు లేనిదే తిరుగు ప్రయాణం చేయరు. మిఠాయి దుకాణాలు, శీతల పానీయాలు దుకాణాల వ్యాపారులు అధిక రేట్లు వసూలు చేసి సొమ్ము చేసుకున్నారు. బాణసంచా పేలుళ్ల చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తుల రద్దీ భారీగా ఉండటంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. అమ్మవారి దర్శనం కోసం రూ.10, రూ.100, రూ.300 టికెట్లతోపాటు వీఐపీ దర్శనం ఏర్పాటు చేసినా.. గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. జిల్లాతోపాటు పొరుగు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి మొక్కులు ఉన్న వారు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. పలువురు ప్రముఖులు గంగమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ కుమార్, వెంకటేష్, గురుస్వామి, చంద్ర, రెడ్డి శేఖర్, బోస్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎద్దుల బండి

అపురూప ఘట్టం.. మహానైవేద్యం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వీరభద్రస్వామికి బంగారు కిరీటం, మూడో కన్ను ధరింపచేసిన వేదపండితులు



తేరుపై విహరిస్తున్న స్వామి వారు



ఆలయ ప్రాంగణంలో రాశిగా పోసిన అన్న ప్రసాదం వద్ద భక్తులు

రాయచోటిటౌన్: రాయచోటిలోని శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో అపురూప ఘట్టమైన మహానైవేద్యాన్ని వేదపండితులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఇదీ ప్రత్యేకత..

స్వామి వారికి రోజూ నైవేద్యం సమర్పిస్తారు. ఏడాదికి ఒకరోజు మహానైవేద్యం సమర్పిస్తారు. దీని కోసం స్వామికి రోజు వారి భత్యంలో భాగంగా ఒక సేరు బియ్యం చొప్పున 365 రోజులకు 365 సేర్లతో వండిన భోజనం, నెలకు ఒక సేరు బియ్యం ప్రకారం 12 నెలలకు 12 సేర్ల బియ్యంతో వండిన అత్తిరసాలు (నిప్పట్లు), వివిధ రకాల కూరగాయలతో వండిన వంటకాలతోపాటు పలు రకాల దుంపలు, గుమ్మడి కాయలు వండి రాశిగా పోస్తారు. ఈ వంటకాలను తెల్లవారుజామున మూడు గంటల నుంచే సుండుపల్లె మండలం శ్రీరామాపురానికి చెందిన భాస్కర్ కుటుంబ సభ్యులు తడిబట్టలతో మడికట్టుతో వండి సిద్ధం చేయడం పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ. వేదపండితులు ప్రణవానంద గిరి స్వామి (నర్రా వెంకట భాస్కర్ సిద్ధాంతి) శిష్యుడు శ్రీ మఠం ఓంకార్‌స్వామి ఆధ్వర్యంలో అన్నానికి పూజలు నిర్వహించాక తీసుకొచ్చి శ్రీ వీరభద్రస్వామి ఆలయం మధ్యలో రాశి పోశారు. అనంతరం వీరశైవులు, కన్నడ భక్తులు సిద్ధాంతి (వేదపండితుల) నుంచి అనుమతి తీసుకున్నాక కత్తులతో విన్యాసాలు చేస్తూ రాశిని కొల్లగొట్టారు. అనంతరం మట్లి వడియరాజులు రాశిలోకి దూసుకెళ్లి రెండు చేతులతో అందినంత తీసుకెళ్లారు.

వైభవం.. రథోత్సవం

శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారి రథోత్స వం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా డప్పువాయిద్యాలు, కోలాటాలు, కర్ణాటక భక్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వీధు లన్నీ శ్రీ వీరభద్రుడి నామస్మరణతో మార్మోగాయి.

అనంతరం ప్రధాన అర్చకులు వేదపండితల సహాయంతో స్వామివారికి బంగారు కిరీట ధారణ చేసి తినేత్రం(మూడోకన్ను) ధరింపచేశారు. స్వామివారి త్రినేత్రం అన్నం రాశిపై పడుతుందని, అప్పుడు ఒక్క క్షణంపాటు ప్రకంపనలు వస్తాయని భక్తుల నమ్మకం. ఆ సమయంలో స్వామి వారికి ఎదురుగా ఎవరూ ఉండకుండా జాగ్రత్త వహిస్తారు. ఆలయ సిబ్బంది పోలీసు అధికారుల సహకారంతో మహానైవేద్యాన్ని స్వామి వారి దర్శనం చేసుకొని వెళ్లే వారికి విస్తర్లలో పంచిపెడతారు.


- మహానైవేద్యం కొల్లగొట్టాక మిగిలిన ప్రసాదాన్ని కన్నడ భక్తులు తీసుకొచ్చి ఆలయం వెలుపల విస్తర్లలో ఎండపెట్టుకున్నారు. ఎండిన తర్వాత వడియాలుగా మార్చుకొని తీసుకెళతారు. ఉపవాసాలు ఉన్న రోజుల్లో వండిన ప్రసాదంలో కలుపుకొని తింటామని వారు చెప్పడం విశేషం. ఆదివారం తెల్లవారుజామున 4–30కు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణా రెడ్డి, అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్య స్వామి, శేఖర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూచిపల్లిలో రెండు రోజుల క్రితం వినాయకం అనే వ్యక్తికి చెందిన ఇంటిలో రెండు బంగారు నెక్లెస్‌లు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన ఇదే గ్రామానికి చెందిన సంతోష్ (20)ను ఆదివారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు.

గ్యాస్ లీకై వ్యక్తి మృతి


అబ్దుల్ కరీం (ఫైల్)

బి.కొత్తకోట : గ్యాస్ లీకైన సంఘటనలో తీవ్రంగా గాయపడిన స్థానిక ఖాజాఖాన్ వీధికి చెందిన లబ్బి అబ్దుల్ కరీం (65) బెంగళూరు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో స్నానానికి వెళ్లగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. స్నానాల గది నుంచి బయటకు రాగానే కుటుంబీకులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే శరీరం కాలిపోవడంతో వైద్యం కోసం కుటుంబీకులు బెంగళూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరగడానికి ముందు యన చౌక్ మసీదులో రంజాన్ సందర్భంగా తొలిరోజు ఇఫ్తార్ విందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ లోగా ఈ ఘటన జరగడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఏటా రంజాన్ తొలిరోజు ఆయన ఇఫ్తార్ విందు ఇవ్వడం అనవాయితీగా వస్తోంది.

వృద్ధుడిపై విష ప్రయోగం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

కురబలకోట : మండలంలోని తెట్టుకు చెందిన సుగాలి చిన్న బిడ్డ (70)పై అదే ఊరికి చెందిన ప్రత్యర్థులు విష ప్రయోగం చేయడంతో పరిస్థితి విషమంగా మారింది. బాధితుడి కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సుగాలి చిన్నబిడ్డకు అదే ఊరికి చెందిన మరొకరితో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఊరికి సమీపంలో ఉన్న ఇతనికి ప్రత్యర్థులు రాత్రి మద్యంలో విష పదార్థం కలిపి తాపించినట్లు బాధితుడితో పాటు అతని కోడలు రమణమ్మ చెబుతున్నారు. అస్వస్థతకు గురైన వృద్ధుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు


కాలిన గాయాలతో పాలగిరి రఫీ

లక్కిరెడ్డిపల్లి : రామాపురం మండలం సనుద్దమల్లకు చెందిన పాలగిరి రఫీ అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం గంగమ్మ ఆలయం వెనుక వైపు ఉన్న జనరేటర్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మంటలు వ్యాపించాయి. మంటల్లో కాలుతుండగా స్థానికులు మంటలను ఆర్పి వేశారు. వెంటనే లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

గన్నే నీకు ఇది తగునా..!

- దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు
- సాగుచేసుకుంటున్న భూముల్లోకి రానివ్వకుండా బెదిరింపులు
- గన్నే సుబ్బనరసయ్యనాయుడు దౌర్జన్యాలపై దళితుల నిరసన
- మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు


గన్నే సుబ్బరాయుడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజంపేట టౌన్ : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు తమకు చెందిన భూముల్లో సాగుచేసుకుంటున్న పంట పొలాల్లోకి రానివ్వకుండా ఇతరుల ద్వారా బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని కొల్లావారిపల్లె మిట్టదళితవాడకు చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత దళితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం వారి పంట పొలాల వద్ద గన్నే సుబ్బనరసయ్యనాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూ లబ్ధిపొందిన వారి కుటుంబాలకు చెందిన జయరామయ్య, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడారు. రాజంపేట మండలం గోపమాంబపురం రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 20/24లో 1.50 ఎకరాల భూమిని 2023వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మన్నెం లక్షుమ్మకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఇచ్చిందన్నారు. ఈభూమి గతంలో లక్షుమ్మ అవ్వ గంగమ్మ పేరిట ఉండేదన్నారు. అలాగే 20/25 సర్వే నంబర్‌లోని 1.50 ఎకరాల భూమి కొట్టం దుర్గాకు, 20/26 సర్వే నంబర్‌లోని 50 సెంట్ల భూమిని మన్నెం పద్మకు ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఇచ్చిందని తెలిపారు. దీంతో తమ భార్యల పేరిట ఉన్న ఈ భూముల్లో తాము పంటలు పెట్టి సాగుచేసుకుంటుండగా గన్నే సుబ్బనరసయ్యనాయుడు అండతో చవన పీరయ్యనాయుడు తమ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని తమను భూముల్లోకి రానివ్వడం లేదని వారు ఆరోపించారు. 2023వ సంవత్సరంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా తమకు కేటాయించిన భూములకు విద్యుత్‌శాఖ అధికారులు పీరయ్యనాయుడు పేరుతో విద్యుత్ కనెక్షన్‌ను ఇచ్చారని, ఈవిషయాన్ని తాము గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు పీరయ్యనాయుడు పేరిట ఉన్న కనెక్షన్‌ను తొలగించారని తెలిపారు. అయితే మళ్లీ అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకుల వత్తిళ్లకు తలొగ్గి పీరయ్యనాయుడుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారన్నారు. దీంతో గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పీరయ్యనాయుడులు తాము సాగుచేసుకుంటున్న పంట పొలాల్లోకి అడుగు కూడా పెట్టనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము తమ భూముల్లోకి వెళితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అలాగే తనపై ఆరోపణలు చేస్తే భారీ మూల్యం కూడా చెల్లించుకోవాల్సి ఉంటుందని గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఇతరుల ద్వారా తమకు హెచ్చరికలు పంపుతున్నట్లు వారు తెలిపారు. సుబ్బనరసయ్యనాయుడు మేకవారిపల్లెలోని వంకపోరంబోకును ఆక్రమించుకొని షెడ్డు నిర్మించుకున్నాడని, అలాగే మిట్టమీదపల్లె మిట్టహరిజనవాడకు చెందిన గుడిసె సుబ్బరాయుడు, శెట్టిపల్లె నరసింహులు, కొండయ్య, మిట్టమీదపల్లెలోని సోమిగారి కుటుంబానికి చెందిన ఐదు ఎకరాల ఉరవడి చేనుకు గన్నే సుబ్బనరసయ్యనాయుడు దొంగపట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నట్లు వారు ఆరోపించారు. గన్నే సుబ్బనరసయ్యనాయుడు రాజంపేట మండలంలో అనేకచోట్ల భూ ఆక్రమణలకు పాల్పడ్డాడని, వాటన్నింటిని కూడా తాము సర్వే నెంబర్లతో సహా వెవెలుగులోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు.

గన్నే చేస్తున్న దౌర్జన్యాలు ఎక్కడా ఉండవు



తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు చేస్తున్న దౌర్జన్యాలు ఎక్కడ కూడా ఉండవు. సుబ్బనరసయ్యనాయుడు దౌర్జన్యాల వల్ల దళితుల భూములకు రక్షణ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు సుబ్బనరసయ్యనాయుడుపై చర్యలు తీసుకోకుంటే దళితుల భూములకు రక్షణ లేకుండా పోతుంది.

- మన్నెం జయరామయ్య, మిట్టదళితవాడ, కొల్లావారిపల్లె పంచాయతీ, రాజంపేట మండలం

దళితులు బతికే పరిస్థితులు లేవు



కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాల వల్ల దళితుల భూములకు రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వాలు మాపై దయతలచి భూములు ఇస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు దౌర్జన్యంగా లాక్కుంటుంటే మేము ఎలా బతకాలి. అధికారులు అధికార పార్టీ నాయకుల వైపే ఉంటారు. ఇక మాబోటి పేదోళ్లకు దిక్కెవరు. ఉన్న భూమిపోతే మేము ఎలా బతకాలి

- గుడిసె సుబ్బరాయుడు, మిట్టదళితవాడ, కొల్లావారిపల్లె పంచాయతీ, రాజంపేట మండలం

ఆత్మహత్యలే శరణ్యం



మేము సాగుచేసుకుంటున్న భూముల్లోకి అధికార పార్టీ నాయకులు అడుగు కూడా పెట్టనివ్వకుంటే ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యం. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమది పేదలకు అండగా ఉండే ప్రభుత్వం అని చెబుతున్న మాటలకు, గ్రామస్థాయిలో ఉండే పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదు. ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం రాష్ట్రంలో దళితులకు, వారి భూములకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే గ్రామస్థాయిలో ఉండే నాయకుల దౌర్జన్యాలకు పేదలు వలసలు వెళ్లాల్సి వస్తుంది.

- మన్నెం ఈశ్వరయ్య, మిట్టదళితవాడ, కొల్లావారిపల్లె పంచాయతీ, రాజంపేట మండలం

పట్టా లేకనే ప్రభుత్వ భూమి ఆన్‌లైన్

బి.కొత్తకోట : మండలానికి చెందిన ఓ సచివాలయ సర్వేయర్ తల్లి పేరిట నమోదైన భూమికి సంబంధించి అసలు పట్టానే జారీ కాలేదని రెవెన్యూ అధికారులు తేల్చారు. గుమ్మసముద్రం పంచాయతీ గండువారిపల్లిలో గ్రామస్తుల సామూహిక అవసరాలు, ఉత్సవాలు, పూజలు నిర్వహించుకునే 4.50 ఎకరాల భూమిని స్థానికురాలైన ఓ మహిళ పేరిట ఆన్‌లైన్‌లో నమోదైందని, ఇందులో ఓ సచివాలయ ఉద్యోగి ప్రమేయం ఉందని గ్రామస్తులు తహసీల్దార్ అజారుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ప్రభుత్వ భూమిని పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ ప్రభుత్వ భూమిపై విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులకు అసలు విషయం తెలిసింది. ఈ గయాళు భూమికి ఎవరికి పట్టా జారీ చేయలేదు. సాగు లేదా ఇతరా అవసరాల నిమిత్తం ఎవరికి కేటాయించలేదని నిర్ధారించారు. అయితే 2016లోనే భూమిని మహిళ పేరుతో ఎలా ఆన్‌లైన్ చేశారన్నది అధికారులకు అర్థం కాలేదు. దీనితో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వాస్తవాల ఆధారంగా నివేదికను సబ్‌కలెక్టర్, కలెక్టర్‌కు నివేదించారు. దీనిపై చర్యలు చేపట్టనుండగా, భూ సమస్యలకు ఓ సచివాలయ ఉద్యోగి కారణమని గండువారిపల్లి గ్రామస్తులు ఆరోపించగా ఆ ఉద్యోగిపైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యల కోసం నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

ఆక్రమిత భూములను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ

పీలేరు : మండలంలో ఆక్రమిత భూములు గుర్తించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా పీలేరు, దొడ్డిపల్లె, యర్రగుంటపల్లె, బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, ముడుపులవేముల పంచాయతీలలో ఇతర మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదు రోజుల పాటు సమగ్ర విచారణ జరిపి ఆక్రమిత భూములు గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై దాడి


గాయపడిన మణికంఠ

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లగొండువారిపల్లె గ్రామ సమీపంలోని తోటల వద్ద మట్టిని తోల కూడదని చెప్పినందుకు మణికంఠ అనే యువకునిపై దాడి చేసి గాయ పరిచారు. బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మట్టిని అక్రమంగా తరలిస్తుంటే తరలించ వద్దని చెప్పినందుకు సాదావలీ, అక్బరమ్మలు అరటి కాయలు కోసే కొడవలితో దాడి చేశారు. దీంతో వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పులివెందుల ఆసుపత్రికి తరలించారు.

నలుగురు మట్కా నిర్వాహకుల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని దస్తగిరిపేటలో మట్కా నిర్వహిస్తున్న నలుగురిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో టూటౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో దస్తగిరిపేటకు చెందిన షేక్ నూరుద్దీన్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.70,250 నగదు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటోలో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత

కడప అర్బన్ : ఆటోలో ల్యాప్‌టాప్ ఇతర విలువైన వస్తువులను మరిచిపోయి దిగిన బాధితునికి పోలీసులు తిరిగి వాటిని అందజేశారు. వివరాలిలా.. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మురళి తన సొంత పనిమీద కడపకు వచ్చాడు. అప్సర సర్కిల్ వద్ద ఆటో దిగే సమయంలో తన ల్యాప్‌టాప్ ఇతర విలువైన వస్తువులు ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయి దిగి వెళ్లిపోయాడు. తర్వాత ఆ విషయాన్ని గుర్తించి చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆటో వచ్చిన మార్గంలోని వివిధ చోట్ల ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ఖాదర్ లు పరిశీలించి ఆటోను గుర్తించాడు. బాధితుడు కోల్పోయిన బ్యాగు, ల్యాప్‌టాప్, వాచ్ ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని బాధితుడికి అందించారు. పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు. అధికారుల ఆదేశాలతో తక్షణం స్పందించిన కానిస్టేబుళ్లను చిన్నచౌకు పోలీస్ స్టేషన్ సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు రాజరాజేశ్వర రెడ్డి, రవి కుమార్, సిబ్బంది ప్రశంసించారు.


ల్యాప్‌టాప్‌ను అప్పగిస్తున్న పోలీసులు

దొంగ.. దొంగ!

అంగళ్లు దొంగల కోసం వేట



అంగళ్లులోని ఓషాపు సీసీ పుటేజీలో కన్పిస్తున్న దొంగ చిత్రం

కురబలకోట : ముదివేడు పోలీసులకు సవాల్‌గా మారిన అంగళ్లు వరుస చోరీల కేసులో దొంగల కోసం వేట మొదలైంది. కురబలకోట మండలం అంగళ్లు కూడలి ప్రాంతంలో హైవే పక్కన శుక్రవారం రాత్రి దొంగలు రెచ్చి పోయిన విషయం తెలిసిందే. రాత్రి 12 గంటల నుండి రెండున్నర గంటల వరకు యథేచ్ఛగా ఒకే రోజు వరుసగా ఏడు షాపుల్లో చోరీకి పాల్పడ్డారు. షాపుల యజమానులు హడలిపోయారు. రూ.2.5 లక్ష విలువ చేసే సామగ్రి, రూ.పది వేలు నగదు చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీ చేసిన ఓ షాపులో సీసీ కెమెరాల్లో ఓ దొంగ ముఖ కవళికలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇద్దరు యువకులు సీసీ పుటేజీలో కన్పిస్తుండగా ఒకరు గుర్తు పట్టే విధంగా కన్పిస్తున్నారు. దీంతో ఇతని కోసం వివిధ పోలీస్ స్టేషన్లకు సమాచారం పంపి విచారిస్తున్నారు. మరో వైపు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు. దొంగలు ఎక్కడున్నా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ చోరీ కేసును ఛేదిస్తామని ఆదివారం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని కొత్తబస్వాపురంలో తొర్రివేముల నాగరాజు (34) ఆదివారం వ్యవసాయ పొలం దగ్గర విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పొలం వద్ద పందుల నివారణ కోసం ఏర్పాటు చేసిన వైరు తగలడంతో ప్రమాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో..

రాయచోటి: రాయచోటి–చిత్తూరు మార్గంలోని రింగ్ రోడ్డు సమీప ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లా సుధాకర్ (50) మృతి చెందాడు. ఆదివారం ఉదయం బైకుపై వస్తున్న సుధాకర్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు కలకడ మండలం, ఎగువ కురవపల్లి గ్రామానికి చెందిన వాడన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

గంగ జాతరలో ఏరులై పారిన మద్యం

- విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు
- భక్తుల జేబులకు చిల్లులు
- పట్టించుకోని అధికారులు


జాతరలో అధిక ధరలతో జరుగుతున్న మద్యం విక్రయాలు


జాతరలో అనుమతులు లేకున్నాసే ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బీర్ బాటిళ్లు

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మ జాతరలో మద్యం దుకాణాలు వెలిశాయి. బాటిల్‌పై రూ. 50 నుంచి రూ. 100 అదనంగా వసూలు చేసి మద్యం దుకాణదారులు లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఇదంతా జరుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. మద్యం దుకాణాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా జాతరలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి భక్తులను దండుకున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే పేకాట క్లబ్బులు, స్లో బాల్ ఆటలను ఏర్పాటు చేసుకొని భక్తుల జేబులకు చిల్లులు వేశారు. ఇదంతా జాతర బయట జరగలేదు. జాతర మధ్యలో సందడిగా ఉన్న ప్రాంతంలో పేకాట క్లబ్బులు జరిగాయి. లక్షలాది రూపాయలు భక్తుల నుంచి దోచుకున్నారు. అడిగే నాథుడే లేకపోవడంతో రంగులరాట్నం, మిఠాయి దుకాణాలు మొదలుకొని చెరుకుల గడల వరకు దోచుకున్న వారికి దోచుకున్నంత అన్నచందంగా అధికంగా వసూలు చేసుకొని వ్యాపాలు కొనసాగించారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించారు.


జూదం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తమామలపై అల్లుడి దాడి


అల్లుడి దాడిలో గాయపడిన అత్తామామలు

మదనపల్లె : మద్యం మత్తులో అత్తమామలపై అల్లుడు దాడిచేసిన ఘటన ఆదివారం పీటీఎం మండలంలో జరిగింది. బూచుపల్లెకు చెందిన గంగాధర(50), లక్ష్మీనరసమ్మ(45) దంపతులు. వీరి కుమార్తె గాయత్రిని అదే గ్రామానికి చెందిన అమరప్ప కుమారుడు విజయ్ ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఉపాధి నిమిత్తం భార్యతో కలిసి బెంగళూరుకు వెళ్లి అక్కడే డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యను వేధింపులకు గురిచేస్తూ అదనపు కట్నం కోసం ఒత్తిడి చేసేవాడు. ఈ క్రమంలో శివరాత్రి పండుగ సందర్భంగా స్వగ్రామానికి భార్యతో కలిసి వచ్చి, ఆమెను పుట్టినింట్లో వదిలి పెట్టాడు. ఆదివారం మధ్యాహ్నం పూటుగా మద్యం సేవించి భార్య వద్దకు వచ్చి గొడవకు దిగాడు. ఆమెపై దాడిచేస్తుండగా, అత్త లక్ష్మీనరసమ్మ, మామ గంగాధర అడ్డుకునే ప్రయత్నం చేశారు. తీవ్ర ఆవేశానికి లోనైన విజయ్ వారిపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టాడు. దాడిలో గాయపడిన గంగాధర, లక్ష్మీనరసమ్మలను 108 వాహనంలో బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఔట్‌పోస్ట్ పోలీస్ సిబ్బంది పీటీఎం స్టేషన్‌కు సమాచారం అందించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న ఓబిలి గ్రామస్తులు


ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న ఓబిలి గ్రామస్తులు


ఇసుక ట్రాక్టర్లు రాకుండా జేసీబీతో గుంత తీస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని ఓబిలి గ్రామ సమీపంలోని చెయ్యేరు నదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను ఓబిలి గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. ఓబిలి, అత్తిగారిపల్లి గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే బోర్ల వద్దకు ఇసుకను తీసుకెళ్తుండటంతో తాగునీటి సమస్య తలెత్తుతుందని గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. గ్రామస్తులు లేనప్పుడు తిరిగి యథావిధిగా ఇసుకను తరలిస్తుండటంతో జేసీబీతో నాలుగు అడుగుల గుంత తీసి ట్రాక్టర్లు వెళ్లకుండా అదుపు చేశారు. వేసవి కాలం రానుండటంతో నీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తగా ట్రాక్టర్లను అడ్డుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు.

బీజేపీ నాయకుడిపై దాడి దారుణం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డ్ మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి


కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి

రామసముద్రం : కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులపై దాడులు చేయడం దారుణమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డ్ మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. రామసముద్రంలో కొద్దిరోజుల క్రితం టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తిని ఆదివారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా దాడికి దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణమూర్తిపై దాడిచేసిన టీడీపీ నాయకులను వదిలే ప్రసక్తి లేదన్నారు. వాలీశ్వరస్వామి ఆలయ అర్చకుడి విషయంలో హైకోర్టు నిర్ణయానికి విరుద్ధంగా చేస్తుంటే, వారికి మద్దతుగా నిలిచినందుకు బీజేపీ నాయకులపై దాడిచేయడం సిగ్గుచేటన్నారు. దాడి విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడి వెనుక ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరున్నా విడిచిపెట్టమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, నారదరెడ్డి, ఆనందనాయుడు, చలపతి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంనాయుడు, వెంకటేష్, జయరాం, భగవాన్, లోకనాథ స్వామి, బాలస్వామి, శంకరస్వామి, సుందరం, అశోక్, శంకర, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య


హత్యకు గురైన వారాధి


వారాధి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె : సంబేపల్లె మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం ముదినేని వడ్డిపల్లెకు చెందిన తిరుపతి వారాధి (65) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు ముదినేని వడ్డిపల్లెకు చెందిన టి. వారాధి గ్రామంలో రోడ్డుకు సంబంధించి బ్రిడ్జి నిర్మాణపు పనులు చేసేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి బ్రిడ్జి నిర్మాణపు పనుల వద్దకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారే సరికి అతను శవమై కనిపించాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుని భార్య రెడ్డమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ హత్య కేసును పోలీసులు సవాల్‌గా తీసుకుని విచారణ ముమ్మరం చేశారు. హత్యకు గురైన తండ్రిని చూసి కొడుకు నాగేశ్వర 'నేను కువైట్ నుంచి వచ్చింది నీ చావు చూసేందుకా నాన్నా' అంటూ కన్నీరు మున్నీరుగా విలపించాడు.

హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వారాధిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ముదినేనివాండ్లపల్లె సమీపంలో హత్యకు గురైన వారాధి మృతదేహాన్ని పరిశీలించారు.